క్లుప్తంగా

ట్యాబ్‌లు పంపిణీ

ఏన్కూరు: మండలంలోని 38 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శనివారం మండల విద్యాశాఖాధికారి దుగ్గిరాల జయరాజ్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్లో ట్యాబ్‌లలో భద్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైల, సీఆర్‌పీలు లచ్చిరాం కృష్ణప్రసాద్, శివాజి, సుమన్, సాంభయ్య, శైలజ, సీసీఓలు లత, హరిత తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల వాసికి సేవారత్న అవార్డు


ఉపేందర్‌రావు

కొణిజర్ల: కొణిజర్లకు చెందిన దొండా ఉపేందర్ రావు గ్లోబల్ స్కాలర్స్ ఫౌండేషన్ వారి జాతీయ సేవా రత్న అవార్డుకు ఎంపికయ్యాడు. శంషాబాద్ విమానాశ్రయంలో పనిచేస్తూనే ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం పాఠశాలలు నిర్వహిస్తున్న ఆయన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ బాధ్యులు తెలిపారు. ఆగస్టులో హైదరాబాద్‌లో జరగనున్న సమావేశంలో ఆయనకు గవర్నర్ తమిళిసై అవార్డు అందజేస్తారు.

సభను జయప్రదం చేయండి

వైరా: వచ్చేనెల 2న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం వైరాలో జరిగిన పొంగులేటి ముఖ్య అనుచరుల సమావేశంలో ఆయన బానోత్ విజయాబాయితో కలిసి మాట్లాడారు. రాహుల్‌గాంధీ హాజరయ్యే సభలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన వర్గీయులు కాంగ్రెస్‌లో చేరతారని తెలిపారు. ఈ సమావేశంలో వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్కెట్ మాజీ చైర్మన్ రోశయ్య, తూము వెంకటేశ్వర్లు, దార్న రాజశేఖర్, వార్డు కౌన్సిలర్ లక్ష్మీబాయితో పాటు సుధాకర్, సైదులు, హుస్సేన్, రమేష్, నరేందర్‌రెడ్డి, అశోక్, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా అధ్యక్షురాలిగా శ్రీలత


శ్రీలత

కల్లూరు: కాంగ్రెస్ పార్టీ కల్లూరు మండల అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన ఇజ్జగాని శ్రీలత ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. తనకు పదవి రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. శ్రీలత ఎంపిక పట్ల కల్లూరు మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు శీలం బ్రహ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి వనుకూరి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు గోసు వెంకటకృష్ణ, యరమల నర్సిరెడ్డి, యరమల వెంకట్రామిరెడ్డి, కుక్కా అంజయ్య, కోట సత్యంలు శనివారం హర్షం వ్యక్తం చేశారు.

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి సత్కారం

సత్తుపల్లి: హైద్రాబాద్‌లో శనివారం జరిగిన ఐఎన్‌టీయూసీ కోర్ కమిటీ సమావేశంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డిని సింగరేణి సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ నాయకులు కలిశారు. ఓపెన్‌కాస్టు గనుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు, నీలపాల రామారావు, నర్సింహారెడ్డి, త్యాగరాజు, ఆల్బర్ట్‌లు సంజీవరెడ్డిని ఘనంగా సత్కరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఎర్రుపాలెం: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బనిగండ్లపాడు పీహెచ్‌సీ వైద్యుడు వీరబాబు సూచించారు. శనివారం బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది వారానికి రెండు సార్లు డ్రైడే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సమీర, సిబ్బంది కాంతమ్మ, రాణి, పద్మావతి, లతాశ్రీ, వెంకటేశ్వరరావు, కుమారి, శకుంతల, హెల్త్ అసిస్టెంట్ సాయిరెడ్డి, అశోక్, గాంధీరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామ సమీపంలోని ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండలాధ్యక్షుడు గోపి మాట్లాడారు. రహదారి గుంతలమయంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, సాయిరామ్, సైదులు, సాంబ, మనోజ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.


కాకర్లపల్లిలోని రైతువేదిక


పల్లె ప్రకృతి వనం


సుందరంగా తీర్చిదిద్దిన వైకుంఠధామం

కాకర్లపల్లి.. ప్రగతి బాట

- అభివృద్ధిలో దూసుకెళ్తున్న పంచాయతీ
- రాష్ట్ర సర్కారు నిధులతో మారిన రూపురేఖలు
- 95 శాతం పన్నుల వసూళ్లు.. 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు

సండే స్పెషల్



కాకర్లపల్లి పంచాయతీ కార్యాలయం

సత్తుపల్లిరూరల్: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని కాకర్లపల్లి గ్రామ పంచాయతీ ప్రగతి పథంలో దూసుకెళ్తున్నది. ఈ పంచాయతీలో 1,320 కుటుంబాలు ఉండగా.. 1,118 మంది జనాభా ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిధులు, పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు చేస్తూ ప్రగతిబాటలో నిలుస్తోంది. అధికారులు, పంచాయతీ సిబ్బంది సహకారంతో 95 శాతం ఇంటి పన్నుల వసూళ్లు చేశారు. ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి నిర్మించేలా ప్రజలకు అవగాహన కల్పించి సక్సెస్ సాధించి ముందంజలో ఉన్నారు సర్పంచ్ కంచర్ల రమాదేవి. కరోనా సమయంలోనూ రోగులకు బెడ్లు ఏర్పాటు చేసి, ఉచిత భోజనం, పోషకాహారం అందించటంతో ఆమె ప్రశంసలు అందుకుంది. పంచాయతీకి ఏడాదికి రూ.9,94,242లు ఆదాయం వస్తుంది. ఎనిమిది మంది సిబ్బంది పని చేస్తున్నారు.

అభివృద్ధి పనుల వివరాలిలా..

- కాకర్లపల్లి పంచాయతీలో సుమారు కోటి రూపాయలతో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టారు.
- రూ.5 లక్షల వ్యయంతో పార్కు ఏర్పాటు చేశారు.
- రూ.12 లక్షల వైకుంఠధామం, లక్ష రూపాయలతో డంపింగ్‌యార్డ్‌ను ఏర్పాటు చేశారు.
- రూ.2.50 లక్షలతో తడి, పొడి చెత్త సేకరించి వర్మీకంపోస్టు ఎరువుల తయారీ కేంద్రాన్ని నిర్మించారు.
- రూ.6 లక్షల వ్యయంతో నర్సరీ ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు.
- రూ.10 లక్షలతో పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి అద్దెకు ఇచ్చారు.
- రూ.12 లక్షలతో రైతువేదిక నిర్మాణం చేపట్టారు.
- మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు ప్రభుత్వ నిధుల నుంచి రూ.27 లక్షలు, రూ.25 లక్షల ఈజీఎస్ నిధులు, ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వ నిధులు రూ.14 లక్షలు, రూ.12 లక్షల ఈజీఎస్ నిధులతో పాఠశాలలను సుందరంగా తయారు చేస్తున్నారు.
- పంచాయతీలోని కోనేరుకుంటలో చేపల పెంపకం చేపట్టేందుకు రూ.10 లక్షలతో అభివృద్ధి చేశారు.

ఉత్తమ పంచాయతీగా అవార్డు..

పెన్షన్ల పంపిణీ, ఉపాధిహామీ కూలీలకు పనిరోజులు కల్పించటం, రక్తహీనత లేని మహిళలు '0'శాతం ఉండటంతో 2022 – 23 సంవత్సరానికి ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావటంతో ఇటీవల ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, కలెక్టర్ వీపీ గౌతమ్ చేతుల మీదుగా సర్పంచ్ కంచర్ల రమాదేవి అవార్డును అందుకున్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా..

పంచాయతీలో ప్రభుత్వం సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ తాగునీరు ప్రజలకు సరిపోకపోవటంతో పంచాయతీలోని 6 మోటార్లతో ట్యాంకులకు నీటిని ఎక్కించి ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తున్నారు. గత రెండేళ్లుగా నీటి పన్నులు వసూళ్లు లేకపోవటంతో పంచాయతీ నుంచి నీటిని సరఫరా చేస్తున్న మోటార్ల విద్యుత్ బిల్లులు నెలకు సుమారు రూ.1.50 లక్షలు వస్తుండటంతో భారంగా మారింది.

వర్మీకంపోస్టు ఎరువు..

పంచాయతీలో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. కిలో రూ.8లకు రైతులకు విక్రయిస్తున్నారు. ఇంకా 5 క్వింటాళ్ల వర్మీకంపోస్టు ఎరువు అమ్మకానికి సిద్ధంగా ఉంది.

గ్రామాభివృద్ధి బాగుంది..



ప్రజలకు, రైతులకు అందరికీ ఉపయోగపడేలా పంచాయతీలో ఆహ్లాదానికి పంచేందుకు ప్రకృతివనం, రైతులు సమావేశం అయ్యేందుకు రైతువేదిక, గ్రామంలో సేకరించిన వ్యర్థాలతో కంపోస్టు ఎరువును తయారు చేసి విక్రయించటం జరుగుతుంది. వైకుంఠధామం ఏర్పాటు చేశారు. రహదారులకు సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల భవనాలను కార్పొరేట్ పాఠశాల భవనాలుగా తీర్చిదిద్దారు. గ్రామాభివృద్ధి బాగుంది.

– పరిమి వెంకటేశ్వరరావు, కాకర్లపల్లి గ్రామస్తుడు

అందరి సహాయ సహకారాలతో..



ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృషి, అధికారులు, పాలకవర్గం, సిబ్బంది సహకారంతో కాకర్లపల్లి పంచాయతీలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. పంచాయతీకి ఆదాయం వచ్చే పనులపై దృష్టి సారించాం. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే ప్రజలు 95శాతం ఇంటి పనులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరిస్తున్నారు.

– కంచర్ల రమాదేవి, సర్పంచ్, కాకర్లపల్లి

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పేర్కొన్నారు. మండలంలోని సీతంపేట, మత్కేపల్లి, రాఘవాపురంల్లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పట్టణాల స్థాయిలో గ్రామాలను అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలుచేస్తుండడమే కాక గ్రామ పంచాయతీలకే నేరుగా నిధులను మంజూరు చేస్తున్నారని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజలను కూడా భాగస్వాములను చేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. అనంతరం పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న, మృతి చెందిన వారి కుటుంబాలను జెడ్పీ చైర్మన్ పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, తహసీల్దార్ మంగీలాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మల్లెల రవీంద్రప్రసాద్, సర్పంచ్‌లు నారపోగు కొండలరావు, తిరుపతి కొండలరావు, కొండపర్తి గోవిందరావు, కన్నెబోయిన కుటుంబరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకట్రామయ్యతో పాటు గురిజాల హనుమంతరావు, నారపోగు యాకోబు, తిరుపతి భాగ్యలక్ష్మి, మంకెన రమేష్, వంకాయలపాటి లచ్చయ్య, షేక్ షిలార్ సాహెబ్, శెట్టి మోహన్ రావు, సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తనిఖీ


సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి బాలికల కళాశాలను తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి

ఏన్కూరు/సత్తుపల్లిటౌన్/ఎర్రుపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై హైకోర్టులో పిల్ దాఖలైంది. హైకోర్టు ఆదేశాల మేరకు.. ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఖమ్మం సివిల్ జడ్జి ఎండీ అబ్దుల్ జావిద్ పాషా, సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, ఎర్రుపాలెంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ కాలేజీని మధిర అడిషనల్ కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్‌రెడ్డిలు శనివారం తనిఖీ చేశారు. ఈ మేరకు కళాశాలల్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్ తదితర వాటిని పరిశీలించారు. కాలేజీలో గదులు, సౌకర్యాలపై హైకోర్టుకు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏన్కూరు, సత్తుపల్లి, ఎర్రుపాలెం కళాశాలల ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వరరావు, భాగ్యలక్ష్మి, ఎస్.రమణారెడ్డి, న్యాయసేవాధికార సంస్థ అధికారి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


విద్యార్థులతో భోజనం చేస్తున్న తహసీల్దార్ ముజాహిద్

ఏన్కూరు: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ ఎండీ ముజాహిద్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, మధ్యాహ్న భోజనం పథకం రిజిస్టర్ పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భోజనం నాణ్యతగా అందించాలని, వంటపాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు శైల, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

వైరా/ముదిగొండ: కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో వైరా తహసీల్దార్ నారపోగు అరుణకు, ముదిగొండ తహసీల్‌లో సీనియర్ అసిస్టెంట్ మానసకు శనివారం వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం వైరా డివిజన్ కార్యదర్శి కొల్లి నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా వైరా డివిజన్ కార్యదర్శి కంకణాల అర్జునరావు, ముదిగొండ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా సీవై పుల్లయ్యలు మాట్లాడారు. కార్మికులకు రూ.10 వేలు పింఛన్, నిరుపేదలకు 120 గజాల ఇంటి స్థలాలను ఇవ్వాలన్నారు. మహిళలకు పురుషులతో సమానంగా వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు కన్నెగంటి వెంకటి, సతీష్, నాగేశ్వరరావు, సంఘం మండల అధ్యక్షుడు యోహాను, దేవపంగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

తల్లాడ/సత్తుపల్లిటౌన్: సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో తల్లాడలో, సత్తుపల్లిలోని నీలం రామచంద్రయ్య భవనంలో శనివారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డివి కృష్ణ ప్రథమ వర్ధంతి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎస్‌కే లాల్ మియా, ఆ పార్టీ కల్లూరు డివిజన్ కార్యదర్శి ఎ.వెంకన్న మాట్లాడుతూ.. ఈ నెల 26న హైద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న వర్ధంతి సభను జయప్రదం చేయాలన్నారు. కృష్ణ ఆదర్శ కమ్యూనిస్టుగా ఎంతో నిస్వార్థంగా నిలబడ్డారని, ఆయన ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, దారావత్ రమణ, పఠాన్ నాగుల్‌మీరా, గురవయ్య, రవి, నరేష్, రామారావు, నాగేశ్వరరావు, డివిజన్ నాయకుడు శ్రీను, శరత్, లాజర్, రాజా పాల్గొన్నారు.

ప్రారంభమైన షాదీఖానా నిర్మాణ పనులు

కల్లూరు: ముస్లిం మైనార్టీ సోదరుల కోసం ఇటీవల మంజూరైన షాదీఖానా నిర్మాణ పనులను తిరిగి శనివారం ప్రారంభించారు. కల్లూరు జామే మసీదు శిథిలమైపోవడంతో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చొరవతో నూతన నిర్మాణానికి రూ.75లక్షలు నిధులు మంజూరైయ్యాయి. ఈ మేరకు షాదీఖానా పనులు ప్రారంభిస్తుండగా.. అటవీ అధికారులు ఈ స్థలం తమదే అంటూ పనులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో పనులు నిలిచిపోయాయి. దీంతో ముస్లిం మతపెద్దలు కలెక్టర్ వీపీ గౌతమ్, ఎమ్మెల్యే వెంకటవీరయ్య దృష్టికి తీసుకెళ్లడంతో.. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సర్వే చేసి ఈ స్థలం షాదీఖానదేనని తెలిపారు. ఈ మేరకు కలెక్టర్, ఎమ్మెల్యేలు అటవీశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో మండల ముస్లిం సదర్ సయ్యద్ అలీ, మసీదు సదర్ షేక్.ఇమామ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కమ్లి, సయ్యద్ ఇషాక్ పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న చెంచిరెడ్డి

సత్తుపల్లిరూరల్: ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వి.చెంచిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక జవహర్‌నగర్‌లోని సంఘ భవనంలో.. కేశవరెడ్డి అధ్యక్షతన సత్తుపల్లి, వేంసూరు మండలాల సంఘ కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు దీర్ఘ కాలంగా పరిష్కరించని సమస్యల కొరకు దశల వారీగా ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఈ మేరకు సోమవారం సంఘ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు ర్యాలీగా తహసీల్ వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి బద్రుద్దీన్, కార్యవర్గ సభ్యులు సాంబశివరెడ్డి, వెంకటాచార్యులు, జి.కృష్ణయ్య, ఏఎస్ ప్రకాశరావు, చెంచిరెడ్డి, బోడేపూడి బాబు, కమలకుమారి, మధుసూదన్‌రాజు పాల్గొన్నారు.

పాఠశాలలో డైనింగ్‌హాల్‌ను ప్రారంభించిన సర్పంచ్


డైనింగ్ హాల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

కొణిజర్ల: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు – మన బడి పథకం కింద నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్‌ను శనివారం సర్పంచ్ సూరంపల్లి రామారావు ప్రారంభించారు. రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన డైనింగ్‌హాల్‌ను సర్పంచ్ పర్యవేక్షణలో నిర్మించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ మహిళలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన

కల్లూరు: కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎన్నెస్పీలో ఉన్న గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు డాక్టర్ నవ్యకాంత్ టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు వారాలు పైబడి కళ్లెతో కూడిన దగ్గు రావడం, సాయంత్రం సమయంలో చెమటలు పట్టడం, ఆకలి లేక పోవడం, బరువు తగ్గడం తదితర లక్షణాలు కనిపిస్తే దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీలత, టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ సురేష్, టీబీ నోడల్ పర్సన్ రామారావు, ఉపాధ్యాయురాళ్లు ప్రసన్న, ఉమారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే అభివృద్ధి

మధిర: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మధిరలోని 181వ బూత్‌లో బీజేపీ కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు బీజేపీకి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు రమేష్, కృష్ణారావు, రాము, రాహుల్, లలిత, అఖిల్, భాను పాల్గొన్నారు.

కారు బోల్తా, ఒకరికి గాయాలు

చింతకాని: మండలంలోని నాగులవంచ పెట్రోల్ బంకు సమీపాన శనివారం కారు అదుపు తప్పి బోల్తా పడగా ఒకరికి గాయాలయ్యాయి. ఏపీలోకి నందిగామకు చెందిన వెంకటాచారి కుటుంబసభ్యులతో కారులో ఖమ్మం వెళ్తున్నాడు. నాగులవంచ సమీపాన రహదారిపై ఉన్న గుంతను తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వెంకటాచారికి స్వల్ప గాయాలు కాగా ఖమ్మం తరలించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కల్లూరు: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై రఘు పేర్కొన్నారు. శనివారం కల్లూరు పట్టణంలో యువకులకు, ఆటో కార్మికులకు మాదక ద్రవ్యాల వాడకం, సైబర్ క్రైం నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించుకున్నారు


తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని పాకలగూడెం పంచాయతీ సత్యనారాయణపురం గ్రామంలోని వెనుక కుంట చెరువుకు సంబంధించిన భూములను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారని వారు తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రామస్తులు తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గోడును విన్నవిస్తూ.. సర్వే నంబర్ 133లో వెనుకకుంట చెరువుకు సంబంధించిన 34 ఎకరాలు భూమి ఉందని, దీనిలో సుమారు 20 ఎకరాల వరకు ఆంధ్రాలోని చింతపల్లి గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. సత్యనారాయణపురంలో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న మాకు సెంటు భూమి లేదని, ఆ భూమిని స్వాధీనం చేసుకొని నిరుపేదలమైన మాకు పంపిణీ చేయాలని కోరారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు వినతులు అందించినా ఫలితం లేదన్నారు. వినతి అందించిన వారిలో కృష్ణ, రమేష్, డి.రాధ పలువురు గ్రామస్తులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ


బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రనాథ్

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్, రావినూతల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలతో పాటుగా దివ్యాంగుల కోసం వినియోగించే ర్యాంప్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దిష్టిబొమ్మ దహనం

కారేపల్లి: ముదిరాజులపై ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా.. కారేపల్లి ముదిరాజుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆయన దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు తురక రాంబాబు, సాంబ, చింతల సంపత్, బొళ్ల రామస్వామి, ఉడతల సంపత్, మురళీ, తురక మల్లేష్, పెద్దమ్మ సత్యం, తురక రవి, పేర్ని వెంకటేశ్వర్లు, అక్కుల నాగరాజు, ఉడతల సారంగపాణి, పెద్దమ్మ రాజు, అనిల్, శ్రీకాంత్, బొళ్ల లచ్చయ్య, అక్కుల శ్రీను, పెద్దమ్మ హరీష్, మల్సూర్, తురక జనార్దన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయ కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు (ఫేర్‌వెల్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల వైస్ చైర్మన్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జాన్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ చిన్నయ్య, ప్లేస్మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆయేషా, కల్చరల్ కన్వీనర్ సాజీదాబేగం, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఫరీద్‌బాబా వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణపై అవగాహన


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

మధిర: మండలంలోని చిలుకూరు గ్రామంలో ప్రజలకు ఆరోగ్య రక్షణపై దెందుకూరు పీహెచ్‌సీ వైద్యుడు పృథ్వీ నాయక్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పర్యవేక్షకుడు లంకా కొండయ్య మాట్లాడుతూ.. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లతో ప్రదర్శన నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి



ముదిగొండ: మాట్లాడుతున్న బండి రమేష్

చింతకాని/ముదిగొండ: దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేష్ పేర్కొన్నారు. మండలాల్లోని నర్సింహాపురం, ముదిగొండ గ్రామాల్లో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు ఉన్నంతకాలం రాష్ట్రంలో బీజేపీకి స్థానం లేదన్నారు. ఈ కార్యక్రమాలల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాచర్ల భారతి, మండల కార్యదర్శులు గోపాలరావు, పురుషోత్తం, సీపీఎం జిల్లా నాయకురాలు పద్మ, వాసిరెడ్డి వరప్రసాద్, వైస్ ఎంపీపీ దామోదర్, నాయకులు వెంకటనర్సయ్య, జానికిరాములు, కృష్ణమూర్తి, రవి, ఉపేందర్, రమణ, యజ్ఞనారాయణ, బసవయ్య, వీరబాబు, రాము, గోపయ్య, బుచ్చిబాబు, గంగాధర్, బట్టు రాజు, మెట్టెల సతీష్, మందరపు వెంకయ్య, ప్రభావతి, రాయల శ్రీనివాసరావు, కోలేటి అరుణ, కల్యాణ్, సురేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.